కాంతులీనుతున్న వీధిలైట్లు

- యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించిన విద్యుత్ సిబ్బంది
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

గాజువాక నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలు విద్యుత్ కాంతులతో వెలిగిపోతున్నాయి. ముఖ్యంగా జీవీఎంసీ 86, 87 వార్డుల్లో లైట్లన్నింటినీ పూర్తిస్థాయిలో వెలిగేలా అటు జీవీఎంసీ, ఇటు విద్యుత్ సిబ్బంది చేపట్టిన ప్రత్యేక కార్యాచరణ సత్ఫలితాలనిస్తోంది. దాదాపు 98 శాతం వీధిలైట్లు వెలగడంతో పారిశ్రామిక ప్రాంతం విద్యుత్ కాంతులతో మెరిసిపోతోంది.



ఇది కదా అభివృద్ధి



87వ వార్డు కళింగవీధిలో మరమ్మతు అనంతరం వెలుగుతున్న వీధిలైట్లు

కూర్మన్నపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు విద్యుత్ అధికారులు స్ట్రీట్ లైట్లన్నీ వెలిగేలా చర్యలు చేపట్టారు. గత వారం జీవీఎంసీ ఎలక్ట్రికల్ విభాగం ఇంజినీర్లు, విద్యుత్ అధికారులు సంయుక్తంగా గాజువాక నియోజకవర్గంలోని విద్యుత్ దీపాలపై సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో 86, 87 వార్డుల్లో సుమారు 63 వీధిలైట్లు వెలగడం లేదని గుర్తించడంతో యుద్ధప్రాతిపదికన వీధి దీపాలు వెలిగేలా చర్యలు చేపట్టారు.

పూర్తిస్థాయిలో వెలిగేలా చర్యలు..

కూర్మన్నపాలెం, వడ్లపూడి, రాజీవ్‌నగర్ తదితర ప్రాంతాల్లో వీధిలైట్లు పూర్తిస్థాయిలో వెలిగేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ విభాగం అధికారులు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. వెలగని వీధిలైట్లను ఎప్పటికప్పుడు గుర్తించి మరమ్మతులు చేపట్టడంతో పాటు కొత్తలైట్లు ఏర్పాటు చేయడం, విద్యుత్ లైన్లలో లోపాలు సవరించడం, స్ట్రీట్‌లైట్లు మానిటరింగ్ చేసే బాక్స్‌లను పునరుద్ధరించడం, ప్రతిరోజు తనిఖీలు చేయడంతో పూర్తిస్థాయిలో వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకుంటున్నారు. కేవలం అధికారులు అందించిన లెక్కలపైనే ఆధారపడకుండా నిత్యం తనిఖీలు చేసేలా సచివాలయ సిబ్బందిని కూడా ఏర్పాటు చేశారు.

సాఫీగా ప్రయాణిస్తున్నాను..



గతంలో పారిశ్రామిక ప్రాంత వీధుల్లో ప్రయాణించాలంటే భయమేసేది. వీధి లైట్లు వెలగక ప్రయాణాలు రద్దు చేసుకునే వాడిని. పలుమార్లు రోడ్డు ప్రమాదానికి గురయ్యాను. గత ప్రభుత్వంలో వీధిలైట్లు వెలగడంలేదని ఫిర్యాదు చేసిన చర్యలుండేవి కాదు. ప్రస్తుతం ప్రభుత్వం వీధిలైట్లు, రోడ్లపై దృష్టి సారించడంతో వీధులన్నీ సుందరంగా కనిపిస్తున్నాయి.

– ఆదారి శ్రీను, గవరవీధి

ప్రాంతాల వారీగా వీధి దీపాల ఏర్పాటు, చేసిన ఖర్చు

- కూర్మన్నపాలెం జంక్షన్‌లో బస్టాప్ పక్కన రూ. లక్షా 50 వేలతో నూతన హైమాస్ట్ లైట్ల ఏర్పాటు.
- కూర్మన్నపాలెం షకీలా జంక్షన్ వద్ద హైమాస్ట్ లైట్ల మరమ్మతు.
- 86వ వార్డు రాజీవ్‌నగర్ జంక్షన్ దగ్గర హైమాస్ట్ లైట్లకు మరమ్మతులు.
- 87వ వార్డు లక్ష్మీపురం జంక్షన్‌లో రూ. లక్షా 50 వేలతో నూతన హైమాస్ట్ లైట్ల ఏర్పాటు.
- 87వ వార్డు గవరవీధిలో రూ. లక్షా 20 వేలతో హైమాస్ట్ లైట్ల ఏర్పాటు.
- 86వ వార్డు కూర్మన్నపాలెం, భరత్‌నగర్, రాజీవ్‌నగర్, ముస్తఫా జంక్షన్, ఫకీర్‌టకియా, శ్రీకృష్ణనగర్, రాసాలమ్మకాలనీ వంటి ప్రాంతాల్లో పాడైన లైట్లను తొలగించి కొత్త లైట్లు ఏర్పాటు చేశారు.
- 87వ వార్డు వడ్లపూడి, గణేష్‌నగర్, కళింగవీధి, లక్ష్మీపురం, తిరుమలనగర్, ఎస్సీకాలనీ వంటి ప్రాంతాల్లో విద్యుత్ దీపాలకు మరమ్మతులు చేపట్టి పాడైన వాటి స్థానంలో కొత్తవి అమర్చారు.



87వ వారు లక్ష్మీపురం జంక్షన్‌లో రూ. లక్షా 50 వేలతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు

వీధిలైట్లు అద్భుతంగా వెలుగుతున్నాయి..



గతంలో మా ప్రాంతంలో వీధిలైట్లు సరిగ్గా వెలగక తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. రాత్రి అయితే బయటికి వెళ్లాలంటే భయమేసేది. ప్రసుత్తం విద్యుత్ అధికారులు వీధి లైట్లపై ప్రత్యేక శ్రద్ధ చూపడంతో లైట్లు వెలుగుతున్నాయి. పర్యవేక్షణతోనే ఈ ఫలితాలని చెప్పొచ్చు.

– గుంట్ల శ్రీనివాసు, ఎస్సీకాలనీ

క్లుప్తంగా

వైఎస్సార్ బీమా పరిహారం అందజేత



తెనాలి పేతురు భార్య వరలక్ష్మికి బీమా పరిహారం అందిస్తున్న గుడివాడ లతీష్

అక్కిరెడ్డిపాలెం: ఇటీవల విశాఖ డెయిరీలో విధులు నిర్వర్తిస్తూ ప్రమాదానికి గురై మరణించిన కార్మికుడి కుటుంబానికి వైఎస్సార్ బీమా పరిహారం బుధవారం అందజేశారు. జీవీఎంసీ 68వ వార్డు గుడివాడ అప్పన్నకాలనీకి చెందిన తెనాలి పేతురు(56) విశాఖ డెయిరీలో విధులు నిర్వర్తిస్తుండగా ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ నవంబర్ 27న మృతి చెందాడు. మృతునికి వైఎస్సార్ బీమా వర్తించడంతో బుధవారం గుడివాడ లతీష్ అత్యవసర ఖర్చుల నిమిత్తం మొదటి విడత రూ.10 వేలు నగదును మృతుని భార్య వరలక్ష్మికి అందజేశారు.

రహదారులు జలమయం



హరిజన జగ్గయ్యపాలెం-శీలానగర్ మలుపు వద్ద వర్షపు నీటిలో వాహన చోదకుల ఇక్కట్లు

అక్కిరెడ్డిపాలెం: తుపాను ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పలు చోట్ల రోడ్లు నీట మునిగాయి. 69వ వార్డు హరిజనజగ్గయ్యపాలెం నుంచి శీలానగర్ మలుపు వద్ద నీట మునిగిన రోడ్డుపై రాకపోకలు సాగించడానికి వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు.

అనధికారిక పార్కింగ్‌కు చెక్



రహదారిలో లారీలను తీయించిన అధికారులు

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్‌కు వెళ్లే దారిలో అనధికారికంగా వాహనాలు పార్కింగ్ చేస్తే చర్యలు తీసుకుంటామని స్టీల్‌ప్లాంట్ సేఫ్టీ జీఎం ఎంఎస్ఎన్ రాజు హెచ్చరించారు. గంగవరం పోర్టు నుంచి స్టీల్‌ప్లాంట్ బీసీ గేటుకు వెళ్లే రహదారికి ఇరువైపులా భారీ వాహనాలను అనధికారికంగా పార్కింగ్ చేస్తున్నారని డీవీఆర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డీవీ రమణారెడ్డి స్టీల్‌ప్లాంట్ సేఫ్టీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన స్టీల్‌ప్లాంట్ సేఫ్టీ హెచ్‌వోడీ దువ్వాడ రామ్ ప్రసాద్ వెంటనే వాహనాలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు భారీ వాహనాలను తొలగింపజేశారు.

13 నుంచి మార్గశిర మాసోత్సవాలు

డాబాగార్డెన్స్ : కురుపాం మార్కెట్ సమీపాన గల కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఈ నెల 13 నుంచి వచ్చే నెల 11 వరకు మార్గశిర మాసోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు బుధవారం ఆలయ ప్రాంగణంలో ఉత్సవాల పోస్టర్‌ను దేవాలయ సంఘం అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి గ్రంధి రామకృష్ణారావు, పట్నాల వెంకటరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్గశిర మాసంలో వచ్చే నాలుగు గురువారాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించనున్నట్టు చెప్పారు. ఉత్సవాల్లో భాగంగా 14న సువర్ణ వస్త్రాలంకరణ, 21న రజత వస్త్రాలంకరణ, 28న ముత్యాల వస్త్రాలంకరణ, వచ్చే నెల 4న అమ్మవారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించనున్నట్టు పేర్కొన్నారు.

ఉక్కు అధికారి శ్రీనివాస్‌కు గురజాడ పురస్కారం



ఉక్కు అధికారి శ్రీనివాస్‌కు పురస్కారం అందజేస్తున్న సినీ గేయ రచయిత చంద్రబోస్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కోక్‌ఓవెన్స్ విభాగం సీనియర్ మేనేజర్, ఉక్కు సాహితీ సమాఖ్య సభ్యుడు ఎ. శ్రీనివాసరావు (వినిశ్రీ)కు గురజాడ పురస్కారం లభించింది. గురజాడ అప్పారావు వర్ధంతి సందర్భంగా విజయనగరం, గురజాడ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో జాతీయ స్థాయి కవితల పోటీలు నిర్వహించారు. శ్రీనివాసరావు రాసిన 'సకారాత్మకం' కవితను గురజాడ ఉత్తమ కవితా పురష్కారానికి ఎంపిక చేశారు. విజయనగరం ఆనంద గజపతి కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ సినీ గేయ రచయిత, అస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ చేతుల మీదుగా శ్రీనివాస్‌కు అవార్డు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షులు పి.వి. నరసింహరాజు, ప్రధాన కార్యదర్శి కాపుగంటి ప్రకాశ్, కోశాధికారి డాక్టర్ ఎ. గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా కోసం దరఖాస్తు చేసుకోవాలి



అగనంపూడిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న అప్పారావు

అగనంపూడి: జీవీఎంసీలో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాలు ఎక్స్‌గ్రేషియా కోసం జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని జీవీఎంసీ వర్కర్స్ యూనియన్ జోన్-6 ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు సూచించారు. 85వ వార్డు అగనంపూడి పెదమడకలో నిర్వహించిన కాంట్రాక్ట్ ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ పోరాటం ఫలితంగా ప్రభుత్వం 25 ఉత్వర్వులు జారీ చేసిందని, ఆ ఉత్తర్వులు మేరకు 19.02.2019 తరువాత మృతి చెందిన కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల వివరాలు జీవీఎంసీలో రాత పూర్వకంగా తెలియజేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్.రాజు, బి.భాస్కర్, సత్యవతి, కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరా నిలిచిపోయి ఇక్కట్లు



దిబ్బపాలెం, పెదమడక కూడలిలో ప్రవహిస్తున్న బొర్రమ్మగెడ్డ



దువ్వాడ వంతెన వద్ద ప్రవహిస్తున్న వరద

అగనంపూడి: గడిచిన మూడు రోజల నుంచి తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు విద్యుత్, సాంకేతిక సమస్యలు తలెత్తి శివారు ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో స్థానికులు మూడు రోజులుగా నీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. అగనంపూడిలోని 85 ఎంఎల్‌డీ ద్వారా 79, 85, 88 వార్డుల్లోని ప్రజలకు జీవీఎంసీ నీటి సరఫరా విభాగం నీటిని అందిస్తోంది. బుధవారం సాయంత్రానికి సమస్య పరిష్కరించి నీటి సరఫరా పునరుద్ధరించనున్నామని విద్యుత్, జీవీఎంసీ అధికారులు చెప్పారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాంతాల్లోని వరద నీరు టోల్‌గేటు సమీపంలోని గెడ్డలో చేరి స్టీల్‌ప్లాంట్, కణితి మీదుగా సముంద్రంలో కలిసింది.

కార్మికవర్గాన్ని దెబ్బ కొట్టే యత్నమే ప్రైవేటీకరణ



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కార్మిక వర్గాన్ని దెబ్బ కొట్టాలనే స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని తెర మీదకు తెచ్చారని, కేంద్ర ప్రభుత్వం కుట్రలు పోరాటంతో ఎదుర్కొంటామని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు తెలిపారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద 1028వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని, అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన తీరు మార్చుకుని స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హోంగార్డ్స్ రైజింగ్ డే



బెస్ట్ హోంగార్డ్ అప్పారావుకు అవార్డు అందజేస్తున్న డీజీఎం సెహగల్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో హోంగార్డ్స్ రైజింగ్ డే ఘనంగా నిర్వహించారు. 61వ హోంగార్డ్స్ రైజింగ్ డేను బుధ వారం స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని హోంగార్డ్స్ బ్యారక్స్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా జనరల్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి హెచ్.ఎం. సెహగల్, విశిష్ట అతిథిగా స్టీల్‌ప్లాంట్ హాస్పిటాలిటీ డీజీఎం టిటి హాజరై జెండా ఎగురవేశారు. హోంగార్డులు అందజేసిన గౌరవ వందనాన్ని ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా సెహగల్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఆస్తుల రక్షణలో హోంగార్డుల సేవలు విశిష్టమైనవన్నారు. టిటి మాట్లాడుతూ శాంతి భద్రతల రక్షణలో పోలీసులకు, ట్రాఫిక్ నియంత్రణలో భద్రతా విభాగానికి హోంగార్డులు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. ఈ సందర్భంగా కె. అప్పారావుకు బెస్ట్ హోంగార్డు అవార్డు, ప్రతిభ చూపిన హోంగార్డులు, పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. హోంగార్డ్స్ ఇన్‌చార్జి ఈ. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

9న లోక్ అదాలత్

బీచ్ రోడ్డు: ఈ నెల 9న జరగబోయే లోక్ అదాలత్‌కు రాబోయే కేసులపై బుధవారం మూడో పట్టణ పోలీసులు కసరత్తు చేశారు. రాజీకి వచ్చే వారి వివరాలను సేకరిస్తున్నారు. ముఖ్యంగా కుటుంబ కలహాలకు సంబంధించిన కేసులను లోక్ అదాలత్ ద్వారా రాజీ చేయడానికి కౌన్సిలింగ్ ఇవ్వనున్నారు.

అంబేడ్కర్ ఆశయాలు స్ఫూర్తిదాయకం



86వ వార్డు కూర్మన్నపాలెంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దేవన్‌రెడ్డి తదితరులు



అంబేద్కర్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న కరణంరెడ్డి తదితరులు

గాజువాక: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు స్ఫూర్తిదాయకమని పలువురు నాయకులు పేర్కొన్నారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాలకు, చిత్ర పటాలకు బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

- 65వ వార్డు ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బీసీ రోడ్‌లోని కాకతీయ జంక్షన్‌లో అంబేద్కర్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ గాజువాక ఇన్‌చార్జి తిప్పల దేవన్ రెడ్డి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ, ఎస్సీ, ఎస్టీ నాయకులు గంట్యాడ గురుమూర్తి, వనజాక్షి, కె.అచ్యుతరావు, రాజారావు, సీహెచ్.చలపతిరావు, వంకర అప్పారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.
- అంబేద్కర్ చిత్ర పటానికి బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ఆధ్వర్యంలో నాయకులు వి.రోహిణి, కట్టా పద్మ, బాటా శ్రీను, బొండా ఎల్లాజీరావు, తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు.

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డులో అంబేద్కర్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రగడ వేణుబాబు, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, మార్పు శేషు, తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. కూర్మన్నపాలెం కూడలిలో ఉన్న అంబేద్కర్ విగ్రహాలకు గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో 87వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, జెర్రిపోతుల ఈశ్వరరావు, కోమటి రమాదేవి, బత్తుల సర్వేశ్వరరావు, పోలేటి సూరి అప్పారావు, నరవ రమణ, శ్రీనివాసరావు, బలిరెడ్డి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

- దువ్వాడ బ్రిడ్జి వద్ద దళిత కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే నాగిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బాటూరి శ్రీనివాసరావు, గాలి ఆనంద్, డా.జొన్నకోటి విజయకుమార్, బత్తిన సత్తిబాబు, బి.ఎ.స్వామి, మిరియాల శ్యామ్, రాజు పాల్గొన్నారు.
- జీవీఎంసీ 87వ వార్డు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్నేటి రమణ, చిత్రాడ వెంటకరమణ, శ్రీరాములు, సూరిఅప్పారావు, పి.సంతోష్, ఆదారి శ్రీను పాల్గొన్నారు.

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అసోసియేషన్ కార్యాలయం, సెక్టార్-6 అంబేద్కర్ పార్కులో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ సీజీఎం(వర్క్స్) ఎస్.వి.స్వామి ముఖ్యఅతిథిగా పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, హెచ్‌ఆర్ జీఎం కె.సంజీవరావు, లైజన్ ఆఫీసర్ వి.తిరుపతిరావు, అసోసియేషన్ నాయకులు ఎస్.సత్యనారాయణ, ఎస్.మోహనబాబు, పుల్లారావు, తదితరులు పాల్గొన్నారు. స్టీల్ వైఎస్సార్‌టీయూసీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో అంబేద్కర్ చిత్రపటానికి యూనియన్ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కర్రి దాలినాయుడు, ఎన్నేటి రమణ, డి.పుల్లారావు, కె.కృష్ణయ్య, బి.రామకృష్ణ, ఎస్.మురళి, పి.బిషాయ్ పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: భెల్(హెచ్‌పీవీపీ)లోని అంబేద్కర్ పార్కులో బుధవారం అంబేద్కర్ విగ్రహానికి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.జితేందర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. సంస్థ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొల్లి దేముడు, సంస్థ జీఎం(ఆపరేషన్) సి.గౌరీశంకర్, ఏజీఎం(ప్రొడక్షన్) నిరాఖర్ ముండా, మహాపాత్రో, జి.చంద్రశేఖర్, గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు బొండ బాబూరావు, సుభాకర్ సాహూ, పి.వి.ఎస్.రాజు, జి.టి.పి.ప్రకాష్, ఎం.మునిలిరెడ్డి, జె.రాము, హెచ్.ఖగేష్, జి.కిరణ్, బి.రాజ్‌కుమార్, డి.సాయిబాబు, పి.శ్రీను, మధుసూదనరావు, పి.విశ్వేశ్వరరావు, జి.ప్రసాద్, డి.ఆదినారాయణ పాల్గొన్నారు.

అగనంపూడి: పాత అగనంపూడి కూడలి సత్రంలో మహాత్మాగాంధీ సేవా సమితి ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి ప్రసాద్ నివాళులర్పించారు. సేవా సమితి అధ్యక్షుడు చిత్తా రామారావు, గోపిశెట్టి సత్యారావు, కట్ట పైడిరాజు, లక్కరాజు రాంబాబు, దుల్ల చల్లారావు, చిత్తా నాగమణి, సగరాల అప్పారావు పాల్గొన్నారు. పినమడకలో దళిత గ్రామీణ కార్మిక యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి సంఘం అధ్యక్షురాలు పులగపూర్తి ఆశారాజ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు గరవ సోమశేఖర్, బలిరెడ్డి సత్యనారాయణ, కసిపల్లి శ్రీనివాసరావు, చిట్టిబాబు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో అంబేద్కర్ చిత్ర పటానికి గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్టుపూడి పరదేశి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ గాజువాక నియోజవకవర్గ ఇన్‌చార్జి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, రాజాన రామారావు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ పల్లా చినతల్లి, గంట్యాడ గురుమూర్తి, గొందేశి శ్రీనివాసరెడ్డి, అండిబోయిన లక్ష్మి, గొందేశి వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీజీఎం స్వామి, నాయకులు



స్టీల్ వైఎస్సార్‌టీయూసీ కార్యాలయంలో..



భెల్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సంస్థ ఈడీ జితేందర్‌రెడ్డి

- బాబూ జగ్జీవన్‌రామ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెదగంట్యాడ జంక్షన్‌లోని ఎస్సీ కాంప్లెక్స్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- వైఎస్సార్ సీపీ 76వ వార్డు నాయకుడు మంత్రి శంకరనారాయణ ఆధ్వర్యంలో నడుపూరు ఎస్సీ కాలనీలో అంబేద్కర్ విగ్రహానికి సత్యానందం, రామ్మోహన్‌రావు, మంత్రి గోపీ, కొవిరి అవతారం, తదితరులు అంజలి ఘటించారు.
- 76వ వార్డు స్వతంత్రనగర్‌లో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి వరాహ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యుడు దొడ్డి రమణ పూలమాల వేసి నివాళులర్పించారు. పేదలకు పండ్లు పంపిణీ చేశారు.



అగనంపూడిలో నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ వరలక్ష్మి, మహాత్మాగాంధీ సేవా సమితి సభ్యులు



అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం



ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న భక్తులు

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు స్వహస్తాలతో జలాభిషేకం చేశారు. ఈవో జీవీ రమాభాయి ఆధ్వర్యంలో అర్చకులు శ్రీనివాస్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారికి పసుపునీటితో జలాభిషేకం చేసి ప్రత్యేక పూలతో అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.